## క్లుప్తంగా

### శ్రీశైల దేవస్థానానికి రూ.2 లక్షల విరాళం



దాత కె.సురేష్‌ను సత్కరిస్తున్న ఏఈఓ

**శ్రీశైలం టెంపుల్‌:** శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి శుక్రవారం కర్నూలుకు చెందిన కె.సురేష్‌, రూ.1,00,116, హైదరాబాద్‌ కు చెందిన ఆంజనేయులు రూ.1,25,000 విరాళాన్ని అందజేశారు. దాతలకు దేవస్థానం తరఫున స్వామి వారి శేష వస్త్రాన్ని, లడ్డూ ప్రసాదాలను, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

### భ్రమరాంబాదేవికి ఊయలసేవ



స్వామి అమ్మ వార్లకు ఊయల సేవ నిర్వహిస్తున్న అర్చకులు

**శ్రీశైలంటెంపుల్‌:** అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం అమ్మవారి మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. సాయంత్రం 7గంటలకు సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజల అనంతరం అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అనంతరం శ్రీశైలంలోని అంకాలమ్మ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### పల్లకీలో విహరించిన మహానందీశ్వరుడు



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

**మహానంది:** మహానందిలో కొలువైన కామేశ్వరీ దేవి, మహానందీశ్వరస్వామి వార్లకు శుక్రవారం రాత్రి పల్లకీసేవను ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతుశర్మ, అర్చకులు వైభవంగా నిర్వహించారు.


### అదుపు తప్పి మిర్చి వాహనం బోల్తా



10 బొల్లవరం సమీపంలో బోల్తా పడిన మిర్చి లోడు వాహనం

**నందికొట్కూరు:** మండల పరిధిలోని 10 బొల్లవరం గ్రామ సమీపంలో అదుపు తప్పి మిర్చి వాహనం(బొలెరో) బోల్తా పడిన ఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వినుకొండ నుంచి కర్ణాటకకు మిర్చి లోడుతో వెళ్తున్న వాహనం 340సీ నేషనల్‌ హైవే పక్కన అదుపు తప్పి బోల్తా పడింది. వాహనంలో ప్రయాణించే వారికి ఎలాంటి ప్రాణపాయం జరగకపోవడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. అతి వేగం వల్లే వాహనం అదుపు తప్పిందని పోలీసులు తెలిపారు.

### యువతకు కారల్‌ మార్క్స్‌ ఆదర్శం



మార్క్స్‌ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

**నందికొట్కూరు:** విప్లవకారుడు కాల్‌ మార్క్స్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ జిల్లా నాయకులు రఘురామ్మూర్తి సూచించారు. శుక్రవారం జైకిసాన్‌ పార్కులో కారల్‌ మార్క్స్‌ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రఘురామ్మూర్తి మాట్లాడుతూ శ్రమ, దోపిడీ, విలువ, వర్గం వీటన్నింటిని లోతుగా విశ్లేషించి మన ముందుంచిన గొప్ప వ్యక్తి కారల్‌ మార్క్స్‌ అని తెలిపారు. ఆయన చూపిన మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనివాసులు, రజిత, యశోదమ్మ పాల్గొన్నారు.

### నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

**మిడుతూరు:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమానికి నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య పాల్గొంటున్నట్లు ఎంపీడీఓ దశరథరామయ్య శుక్రవారం తెలిపారు. ఏవైనా సమస్యలుంటే అర్జీల రూపంలో అందజేయాలని మండల ప్రజలను కోరారు.

# జూపాడు + విక్టోరియా బంగ్లా= జూపాడుబంగ్లా

- 175 ఏళ్లైనా చెక్కుచెదరని విక్టోరియా మహారాణి బంగ్లా
- నెహ్రూ, పీవీ నరసింహారావులతోపాటు పలువురి సేదతీర్చిన బంగ్లా
- పురాతన కట్టడాన్ని రక్షించటంలో కరువైన చర్యలు

**జూపాడుబంగ్లా:** మండల కేంద్రం జూపాడుబంగ్లాలో 175 ఏళ్ల క్రితం బ్రిటీష్‌ మహారాణి విక్టోరియా హయాంలో నిర్మించిన బంగ్లా నేటికీ చెక్కు చెదరలేదు. అలాగే దాని పేరు మీదుగానే జూపాడుబంగ్లాగా ఇప్పటికీ చలామణి అవుతోంది. రోడ్డురవాణా మార్గం లేని సమయంలో బ్రిటీషు వారు అధికంగా జలమార్గం ద్వారానే ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి బోట్లలో ప్రయాణించేవారు. అందులో భాగంగా కర్నూలు నుంచి కడప వరకు ప్రయాణించేందుకుగాను 1866లో బ్రిటీష్‌ పాలనలో డచ్‌దేశానికి చెందిన మద్రాసు ఇరిగేషన్‌ అండ్‌ కెనాల్‌ కంపెనీ లిమిటెడ్‌ ద్వారా కర్నూలు–కడప కాల్వను తవ్వేందుకు శ్రీకారం చుట్టారు. 1882లో కాల్వ నిర్మాణం పనులను బ్రిటీషు వారు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. 1850లో ప్రారంభించిన కాల్వ నిర్మాణం పనులను విక్టోరియా మహారాణి స్వయంగా పర్యవేక్షించేవారట. ఆమె విశ్రాంతి తీసుకొని, నిద్రించేందుకుగాను 1885 సంవత్సరంలో కర్నూలు–గుంటూరు రహదారి పక్కన ఓ బంగ్లాను నిర్మించారు. ఆమె బంగ్లాలో ఉంటూ కాల్వ నిర్మాణం పనులను 1870లో పూర్తిచేయించారు. హోస్పేట్‌ డ్యాం నుంచి సుంకేసులకు, సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు నీటిని విడుదల చేసి ఆ నీటిలో బ్రిటీషు అధికారులు కర్నూలు నుంచి కడపకు నౌకల ద్వారా ప్రయాణించేవారు. 1933లో కేసీ కాల్వలో సర్‌ ఆర్థర్‌కాటన్‌ కాల్వలో నౌకాయానాన్ని పూర్తిగా నిషేధించి కాల్వను కేవలం సాగునీటి అవసరాల నిమిత్తం వినియోగించారు. 304 కిలోమీటర్ల మేర ఉన్న కేసీ కాల్వ కింద 52,746 హెక్టార్లకు సాగునీటిని ఇస్తున్నారు. వైఎస్సార్‌ కడప జిల్లాలో 94 వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తోంది.

### ఆ ఊరికి పేరెలా వచ్చిందంటే?

కర్నూలు–గుంటూరు రహదారి పక్కన 1855లో విక్టోరియా బంగ్లాను నిర్మించారు. ఈ బంగ్లా సమీపంలో జూపాడు(80 బన్నూరు గ్రామ సమీపంలో ప్రస్తుతం ఆంజనేయ, ఈశ్వర ఆలయాలున్న ప్రాంతం)అనే గ్రామం ఉండేది. కాలక్రమేణా గత్తరవ్యాధి వ్యాపించటంతో జూపాడు గ్రామం కనుమరుగైంది. విక్టోరియా బంగ్లా జూపాడు అనే గ్రామానికి సమీపంలో ఉండటంతో జూపాడుబంగ్లా అని రూపాంతరం చెందింది. ఆ పేరుమీదనే ప్రస్తుతం జూపాడుబంగ్లా మండలకేంద్రం ఆవిర్భవించింది.



నౌకాయాన మార్గం కోసం బ్రిటీషు వారు తవ్విన కేసీ కాల్వ

### భారతీయుల మన్ననలు పొందిన విక్టోరియా మహారాణి

పేరుకే బ్రిటీషు మహారాణి అయిన విక్టోరియా భారతదేశంలో అనేక అభివృద్ధి పనులను చేపట్టి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. కర్నూలు–కడప కాల్వ నిర్మాణం సమయంలో పనులకు వచ్చే భారతీయుల పట్ల ఎంతో ప్రేమాభిమానాలను వ్యక్తం చేసేవారు. గర్భిణులు, బాలింతలు ఎవ్వరైనా పనులకు వస్తే వారితో పాటు చంటిబిడ్డలకు కూడా కూలీడబ్బులు చెల్లించేదని ప్రజలు పేర్కొంటున్నారు. విక్టోరియా మహారాణి బంగ్లాలో బసచేసే సమయంలో వినియోగించిన అనేక వస్తువులు శిథిలం కాగా అద్దం మాత్రం చెక్కుచెదరకుండా ఉంది.



విక్టోరియా మహారాణి వినియోగించిన అద్దం



ప్రస్తుతం రైతులకు వరప్రదాయినిగా మారిన కేసీ కాల్వ



బంగ్లా నిర్మాణానికి సాక్ష్యంగా నిలిచిన 165 ఏళ్లనాటి చింత వృక్షం

### శిథిలావస్థలో విక్టోరియా బంగ్లా

175 ఏళ్ల క్రితం విక్టోరియా మహారాణి కోసం నిర్మించిన బంగ్లా ప్రస్తుతం శిథిలావస్థలో ఉంది. ఈ బంగ్లా నిర్మాణశైలిని చూస్తే ఎవ్వరైనా అబ్బురపడాల్సిందే. లోపలిభాగం 15 అడుగుల ఎత్తుతో పైకప్పు మొత్తం చెక్కతో నిర్మించారు. పైన సిమెంటు, ఇసుక, పాలు గానుగపట్టి వేసినట్లు ఇంజినీరింగ్‌ అధికారులు పేర్కొంటున్నారు. ఆపైన వర్షం నీళ్లు లీకేజీ కాకుండా తారుతో కప్పేశారు. వరండా భాగానికి వినియోగించిన పెంకులు నేటికీ చెక్కుచెదరలేదు. 1980లో మండల వ్యవస్థ ఏర్పడిన తర్వాత తహసీల్దార్‌, ఎంపీడీఓ కార్యాలయాలను ఈ బంగ్లాలో నిర్వహించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ బంగ్లాలోకి వెళ్తే వాతావరణం ఏకాలంలోనైనా చల్లగా ఉండటం విశేషం. నెహ్రూ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో అంబాసిడర్‌ కారులో రోడ్డుమార్గం గుండా శ్రీశైలం వెళ్తూ విక్టోరియా బంగ్లాలో కాసేపు విశ్రాంతి తీసుకున్నట్లు సమాచారం. దామోదరం సంజీవయ్య, పీవీ నరసింహారావు వంటి ప్రధానమంత్రులు, ముఖ్యమంత్రులతోపాటు పలువురు వీఐపీలకు ఈ బంగ్లా సేదతీర్చింది. ఇలాంటి అపురూపమైన విక్టోరియా బంగ్లాను పురాతన కట్టడాల కింద చేర్చి పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉంది.



175 ఏళ్ల క్రితం విక్టోరియా మహారాణి కోసం నిర్మించిన బంగ్లా

### అర్హులకు స్థలాలు ఇవ్వాలి



ప్రజలతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

**ఆత్మకూరు:** అర్హులందరికీ ఇంళ్ల స్థలాలు ఇచ్చి, నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం చేయాలని సీపీఎం పట్టణ కమిటీ కార్యదర్శి ఎ.రణధీర్‌, అర్బన్‌ కాలనీ కార్యదర్శి షేక్‌ఇస్మాయిల్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. శుక్రవారం అర్బన్‌ కాలనీలోని బిలాల్‌మసీదు ఏరియాల్లో ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు రెండు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలన్నారు. హైవే ఏర్పాటులో స్థలాలు పోయిన జగనన్న కాలనీ లబ్ధిదారులకు మరోచోట స్థలాలు ఇచ్చి ఇళ్ల నిర్మాణాలకు ఆర్థిక సాయం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ నాయకులు డి.రామ్‌నాయక్‌, వీరన్న, జబివుల్లా, భాస్కర్‌, చాంద్‌బాషా, మాబాషా, గౌస్‌, మూర్తుజా, షఫీ, వలి, షుకూర్‌ పాల్గొన్నారు.

## పాదయాత్రగా తిరుమలకు పయనం



తిరుమలకు పాదయాత్రగా బయలుదేరిన భక్తులు

**పాములపాడు:** తిరుమలలో కొలువైన వేంకటేశ్వర స్వామి దర్శనార్థమై మండలం నుంచి భక్తులు శుక్రవారం పాదయాత్రగా బయలుదేరారు. 10 రోజుల పాటు సాగనున్న పాదయాత్ర విరాట్‌పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి ఆశ్రమం నుంచి ప్రారంభమైంది. రహదారి వెంట ఆలయాలు, కాశిరెడ్డినాయన ఆశ్రమాల వద్ద ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భిక్ష, రాత్రి అల్పాహారంతో వీరి యాత్ర కొనసాగనుంది. కుక్కలదొడ్డి గ్రామం వరకు రహదారి వెంట నడిచి అక్కడి నుంచి ఈనెల 23న అడవీ మార్గంలో తింబుర తీర్థం మీదుగా అన్నమయ్య అడవి మార్గం గుండా తిరుమలకు చేరుకోనున్నట్లు భక్తులు తెలిపారు.

**మిడుతూరు నుంచి..**

**మిడుతూరు:** గోవిందమాల ధారులు, పలువురు వేంకటేశ్వర స్వామి భక్తులు శుక్రవారం స్థానిక లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం నుంచి శుక్రవారం తిరుమలకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. మండల దీక్ష పూర్తయిన తర్వాత ఇరుముడులను తలపై ధరించి గోవింద నామ స్మరణ చేసుకుంటూ పాదయాత్రగా బయలుదేరారు. గోవిందమాల ధరించిన స్వాములతో పాటు మండలంలోని పీరుసాహెబ్‌ పేట, చింతలపల్లి, సుంకేసుల, తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివెళ్లారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించాలి



సమస్యలను సీపీఎం బృందానికి తెలియజేస్తున్న గ్రామస్తులు

**ఆత్మకూరు:** ప్రజా సమస్యలు పరిష్కరించాలని సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి పి.సుధాకర్‌, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.నరసింహానాయక్‌, ప్రజా సంఘాల నాయకులు పెద్ద నాగన్న, వెంకటేశ్వర్లు, వెంకటసుబ్బయ్య, మౌలాలి ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ప్రజా చైతన్యయాత్రలో భాగంగా శుక్రవారం కరివేన గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాలనీల్లో పర్యటించి సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తమ గ్రామం మీదుగా ఏర్పాటు చేస్తున్న నేషనల్‌ హైవేలో భాగంగా ఒకచోట మాత్రమే హైవే అధికారులు పాయింట్‌ ఏర్పాటు చేశారని, మరోచోట కూడా పాయింట్‌ ఏర్పాటు చేస్తే రాకపోకలకు ఇబ్బంది ఉండదని గ్రామస్తులు నాయకుల దృష్టికి తెచ్చారు. రోడ్డుకు ఇరువైపులా రెండు బస్‌ షెల్టర్‌లను ఏర్పాటు చేయాలని, తాగునీరు ఎర్రగూడూరు పైపులైన్‌ నుంచి సరిగా అందక అవస్థలు పడుతున్నామని వారికి విన్నవించారు. సమస్యలన్నింటినీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేంత వరకు పోరాటం చేస్తామని నాయకులు గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

- **బండి ఆత్మకూరు:** మండలంలోని బి.కోడూరు గ్రామంలో సీపీఎం నాయకులు డేవిడ్‌, బాలుడు, సుబ్బ రాయుడు , వెంకటేశ్వర్లు పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు.

## మద్యం స్వాధీనం



నిందితులను చూపుతున్న సీఐ రాము

**ఆత్మకూరు:** అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రాము తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. బాపనంతపురం, వెలుగోడు రస్తాలో సిబ్బందితో తనిఖీలు నిర్వహించగా ఆటోలో 24 బీర్‌ బాటిల్స్‌, 144 క్వార్టర్‌ బాటిల్స్‌, 6 ఫుల్‌ బాటిల్స్‌, 9 ఆఫ్‌ బాటిల్స్‌తో నల్లకాలువకు చెందిన ఆటో డ్రైవర్‌ మధుకుమార్‌, రామిరెడ్డి పట్టుబడ్డారని సీఐ తెలిపారు. రామిరెడ్డి తన బంధువుల పెళ్లి కోసం ఆత్మకూరులోని వివిధ దుకాణాల నుంచి మద్యం కొనుగోలు చేసి ఆటోలో తీసుకెళ్తుండగా పక్కా సమాచారంతో పట్టుకున్నామన్నారు. ఆటోను సీజ్‌ చేసి, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. సోదాల్లో పోలీసు సిబ్బంది వేణుగోపాల్‌, శివరామ్‌, రంగస్వామి, రవి, లక్ష్మణ్‌, అమీర్‌ పాల్గొన్నారు.

## అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ



అమ్మ వారికి కొబ్బరి కాయలు సమర్పిస్తున్న దృశ్యం

**శ్రీశైలంటెంపుల్‌:** శ్రీశైల భ్రమరాంబా దేవి అమ్మవారికి శుక్రవారం కొబ్బరి కాయలు సమర్పించారు. చైత్రమాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళ లేదా శుక్రవారం రోజున (ఏ రోజుముందుగా వస్తే ఆ రోజు) భ్రమరాంబాదేవి అమ్మవారికి కుంభోత్సవం జరపడం సంప్రదాయం. ఈ సంవత్సరం ఏప్రిల్‌ 15న కుంభోత్సవం నిర్వహించనున్నారు. అమ్మవారికి సాత్వికబలి నిర్వహించేందుకు కొబ్బరి, గుమ్మడి, నిమ్మకాయలు సమర్పించడం ఆనవాయితీ. కుంభోత్సవం రోజున స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతి సమర్పించడం ప్రధాన ఘట్టం. కాగా ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే ప్రతి మంగళవారం, శుక్రవారం రోజులలో అమ్మవారికి కొబ్బరికాయలను సమర్పిస్తారు. ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరి కాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమలతో పూజాదికాల తరువాత అమ్మవారికి సమర్పించారు.

### రాయితీపై వ్యవసాయ పరికరాలు

**వెలుగోడు:** ప్రభుత్వం రాయితీపై ఇచ్చే వ్యవసాయ పరికరాల కోసం రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుని, పేర్లు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి పవన్‌ కుమార్‌ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బ్యాటరీ స్ప్రేయర్లు, ఫుట్‌ స్ప్రేయర్లు, తైవాన్‌ స్ప్రేయర్లు, ట్రాక్టర్‌ దుక్కు, దమ్ము సెట్లు, రోటోవేటర్లు, పవర్‌ వీడర్లు, పవర్‌ టిల్లర్లను 50 శాతం సబ్సిడీతో అందించనున్నట్లు చెప్పారు. మరింత సమాచారం కోసం స్థానిక రైతు సేవ కేంద్రం సిబ్బందిని సంప్రదించాలన్నారు.

### పట్టణాభివృద్ధికి సహకరించండి

**ఆత్మకూరు:** సకాలంలో పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్‌ కమిషనర్‌ రమేష్‌బాబు కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2024–25లో హౌస్‌ ట్యాక్స్‌, ఆస్తి పన్ను, కుళాయి పన్ను ఈనెల 31వ తేదీలోపు చెల్లించాలన్నారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తనదృష్టికి తీసుకురావాలని సూచించారు.

### నేటి నుంచి ఒంటిపూట బడులు

**జూపాడుబంగ్లా:** ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శనివారం నుంచి ఒంటిపూట బడులు నిర్వహించనున్నట్లు ఎంఈఓ–1 చిన్నమద్దిలేటి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మాత్రమే పాఠశాలలు నిర్వహించాలన్నారు. ఇంటర్‌, పదో తరగతి ఎగ్జామ్‌ సెంటర్లున్న పాఠశాలల్లో మధ్యాహ్నం 1.15 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలలు నిర్వహించాలన్నారు.

### నివాళి

**పాములపాడు:** మండలంలోని క్రిష్టానగర్‌ గ్రామానికి చెందిన కామేశ్వరరావు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తొగురు ఆర్థర్‌ శుక్రవారం గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

### టిక్కెట్లు బుక్‌ చేస్తానని బురిడీ?

**శ్రీశైలంటెంపుల్‌:** శ్రీశైల మల్లన్న స్పర్శ దర్శనం, వసతి గదులు బుక్‌ చేస్తానని శ్రీశైలానికి చెందిన ఓ వ్యక్తి భక్తులను బురిడీ కొట్టించిన ఘటన శుక్రవారం వెలుగుచూసింది. బాధిత భక్తులు తెలిపిన వివరాలు.. విజయవాడకు చెందిన భక్తులకు స్పర్శ దర్శనం, వసతి గది బుక్‌ చేస్తానని శ్రీశైలానికి చెందిన ఓ వ్యక్తి మాయ మాటలు చెప్పి ఫోన్‌ పే ద్వారా డబ్బు వేయించుకున్నాడు. అనంతరం అతడు ఫోన్‌ స్విచ్‌ ఆఫ్‌ చేశాడు. ఈ విషయమై బాధితులు మీడియాకు తెలిపారు.

## హామీ ఇచ్చి మరిచిన జిల్లా వైద్యాధికారి

- పీహెచ్‌సీకి మంజూరు కాని పరికరాలు
- పీహెచ్‌సీలో ప్రారంభం కాని సుఖప్రసవాలు



పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్‌ వెంకటరమణ(ఫైల్‌)

**జూపాడుబంగ్లా:** స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి ప్రసవాలు చేసే పరికరాలు మంజూరు చేయిస్తామని జిల్లా వైద్యాధికారి వెంకటరమణ రెండు మాసాల క్రితం హామీ ఇచ్చారు. అయినా ఇంతవరకు అతీగతీ లేకపోవడంతో పీహెచ్‌సీలో ప్రసవాలు చేయడం లేదు. జనవరి 30న 'సాక్షి'లో 'ప్రసవవేదన' శీర్షికన కథనం ప్రచురితమైంది. అప్పట్లో జిల్లా వైద్యాధికారి స్పందించి పీహెచ్‌సీకి చేరుకుని పరిశీలించారు. ప్రతి నెలలో కనీసం ఐదు ప్రసవాలు చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రసవాలు చేసేందుకు అవసరమైన పరికరాలు లేవని పీహెచ్‌సీ డాక్టర్‌ గంగాధర్‌ ఆయన దృష్టికి తీసుకెళ్లగా రెండు రోజుల్లోగా పరికరాలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చి వెళ్లారు. రెండు నెలలు గడిచిపోయినా ఆ ఊసే లేకపోవడంతో ప్రసవాలు చేయడం లేదు. ఇప్పటికైనా పీహెచ్‌సీకి ప్రసవాలు చేసే పరికరాలు మంజూరు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## ఆలయంలోనే అనధికార దుకాణం

- రుద్రాక్షలు విక్రయిస్తున్న అర్చకుడు



అనధికారింగా రుద్రాక్షలు, యంత్రాల విక్రయిస్తున్న అర్చకుడు

**మహానంది:** మహానందిలోని వినాయకనంది ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ముఖ్య అర్చకుడు రాజారత్తయ్యబాబు ఆలయంలోనే అనధికార దుకాణం నిర్వహణకు తెరతీశారు. రుద్రాక్షలు, నవరత్నాల మాలలు, నరఘోష, నరదృష్టి, వాస్తు యంత్రాల పేరుతో ఏకంగా ఓ మినీ షాపులాగా పెట్టేశాడు. ఈ విషయమై ×సాక్షి₹ ప్రశ్నించగా ×అడిగేందుకు నువ్వెవడివి, ఎవడికి చెప్పుకుంటావో చెప్పుకో... మహా అయితే సస్పెండ్‌ చేయిస్తారు, తర్వాత నీ అంతు చూస్తా₹ అంటూ బెదిరింపులకు దిగారు. కాగా ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డిని వివరణ కోరగా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆలయంలో అనధికారింగా వస్తువులను ఎవరైనా విక్రయిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

## అదిగదిగో సంగమేశ్వరం!



కృష్ణాజలాల నుంచి బయల్పడుతున్న సంగమేశ్వరాలయం

**కొత్తపల్లి:** శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం క్రమేపీ తగ్గుముఖం పడుతూ 885 అడుగుల నుంచి 844 అడుగులకు చేరుకుంది. శుక్రవారం మండలంలోని సప్తనదీ సంగమ ప్రాంతంలోని కృష్ణా జలాల జాలాధివాసం నుంచి ప్రాచీన సంగమేశ్వరాలయం బయల్పడబోతుంది. దీంతో భక్తులు సంగమేశ్వరాలయం చూసేందుకు తరలి వస్తున్నారు. దూరం నుంచే కృష్ణాజలాలనుంచి బయటపడుతున్న ప్రాచీన సంగమేశ్వరాలయాన్ని చూసి భక్తితో స్మరించుకొంటూ కృష్ణా జలాలో పుణ్యస్నాణాలు ఆచరిస్తున్నారు. కృష్ణానది ఎగువన ఉన్న ఉమామహేశ్వరాలయంలో శివలింగానికి, లలితాదేవి అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, మంగళహారతులు వంటి విశేషపూజా కార్యక్రమాలు నిర్వహించుకున్నారు.

## నేడు వేలాలు జరిగేనా?

- సుమారు 50 తాత్కాలిక షాపులకు వేలాలు
- మార్కింగ్‌ వేసిన అధికారులు
- తోపుడు బండ్ల స్థానంలో షెడ్లు వేసేందుకు ప్రణాళికలు

**మహానంది:** మహానంది దేవస్థానంలో నేడు టోల్‌గేట్ల నిర్వహణతో పాటు షాపింగ్‌ కాంప్లెక్స్‌లోని పలు దుకాణాలకు వేలాలు జరగనున్నాయి. వీటితో పాటు ప్రస్తుతం టెలిఫోన్‌ ఎక్స్ఛేంజ్‌ నుంచి బ్రాహ్మణ కరివేన సత్రం వరకు తోపుడు బండ్ల పేరు మీద తాత్కాలిక దుకాణాలను చిరువ్యాపారులు నిర్వహించుకుంటున్నారు. వీటి స్థానంలో దేవస్థానం ఆధ్వర్యంలో నిర్ణీత కొలతలతో దేవస్థానం వారు తాత్కాలిక షెడ్లు వేసి బహిరంగ వేలాలను నిర్వహించనున్నారు. వీటి నిర్వహణ కోసం శుక్రవారం దేవస్థానం అధికారులు సుమారు 50 షాపులకు మార్కింగ్‌ వేశారు. బహిరంగ వేలాల్లో పాల్గొనేందుకు ఒక్కొక్కరు రూ. పదివేలు డిపాజిట్‌ చెల్లించాలని నిర్ణయిస్తూ ఇప్పటికే పత్రికల ద్వారా ప్రకటనలు సైతం ఇచ్చారు. ప్రస్తుతం వ్యాపారులు నిర్వహిస్తున్న తోపుడుబండ్ల పేరు మీద ఒక్కొక్క దుకాణానికి రూ. 2వేలు వసూలు చేస్తున్నారు. బహిరంగ వేలాలు జరిగితే ఇవే షాపులకు తీవ్రపోటీ నెలకొననుంది. దీంతో ప్రస్తుతం ఉన్న సుమారు 40 తోపుడుబండ్ల ద్వారా నెలకు దేవస్థానానికి రూ. 80వేల వరకు ఆదాయం వస్తుండగా బహిరంగ వేలాలు జరిగితే రూ.లక్షల్లో ఆదాయం సమకూరనుంది. ఇదిలా ఉండగా వీటిని ప్రస్తుతానికి తాత్కాలికంగా వాయిదా వేయించేందుకు కొందరు కూటమి నేతల ద్వారా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.